క్లుప్తంగా

ఈఏపీసెట్ ఫలితాల్లో పూడిపర్తి విద్యార్థి ప్రతిభ


శ్రీశాంత్

వెంకటాచలం : ఏపీ ఈఏపీ సెట్ 2024 ఫలితాల్లో వెంకటాచలం మండలం పూడిపర్తి గ్రామానికి చెందిన బొనిగి శ్రీశాంత్ జిల్లా స్థాయిలో 460వ ర్యాంక్ సాధించారు. శ్రీశాంత్ తండ్రి మురళి వ్యవసాయం చేస్తూ తన కుమారుడిని చదివించాడు. నారాయణ కళాశాలలో చదివిన శ్రీశాంత్ 76.44 పర్సంటైల్‌తో జిల్లా స్థాయిలో 460వ ర్యాంక్ సాధించాడు. ఐఐటీ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లోనూ ఓపెన్ క్యాటగిరీలో 3,529వ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా శ్రీశాంత్ మాట్లాడుతూ కష్టపడి చదవి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొస్తానని తెలిపారు.

16, 17న వ్యక్తిత్వ వికాసంపై ఉచిత శిక్షణ

నెల్లూరు(బారకాసు) : స్టూడెంట్స్ టీచర్స్ ఎడ్యుకేటర్స్ పేరెంట్స్(ఎస్‌టీఈపీ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 16, 17వ తేదీల్లో ఉచిత పరిపూర్ణ వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులను గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, నెక్కల్లు గ్రామంలోని శ్రీరమణరావు, సావిత్రమ్మ ధ్యాన ఆశ్రమంలో నిర్వహిస్తున్నట్లు ఆ కమిటీ జిల్లా కన్వీనర్ కె.కృష్ణప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు, సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు నాయకత్వంలో పది అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో పాల్గొనే వారికి ఉచిత భోజనం, వసతితో పాటు మెటీరియల్ అందిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని యువత, టీచర్లు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాల్గొనే వారు ముందుగా వాట్సప్‌లో వివరాలను పంపి రిజిస్టర్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 94405 36264 నంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

16న జెట్టి శేషారెడ్డి స్మారక సదస్సు

నెల్లూరు(అర్బన్) : దివంగత ప్రజా డాక్టర్ జెట్టి శేషారెడ్డి 16వ స్మారక సదస్సును హరనాథపురంలోని డాక్టర్ జేఎస్ విజ్ఞాన కేంద్రంలో ఈనెల 16వ తేదీ నిర్వహిస్తున్నామని ప్రజారోగ్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంవీ రమణయ్య మంగళవారం తెలిపారు. ఉదయం 9.30 గంటలకు భారత రాజ్యాంగం-విలువలు-సవాళ్లు అనే అంశంపై హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ టి.రజని ఉపన్యసిస్తారని తెలిపారు. అలాగే 'ఆరోగ్య హక్కు చట్టం ఆంధ్రప్రదేశ్ 2024' అనే అంశంపై ప్రజారోగ్య ఉద్యమ సమన్వయకర్త డాక్టర్ టి.సుందరరామన్ మాట్లాడుతారని తెలిపారు. రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల, జనవిజ్ఞాన వేదిక, ప్రజారోగ్య వేదిక, డాక్టర్ జేఎస్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సదస్సులు జరుగుతాయని పేర్కొన్నారు. పీడీఎఫ్ ఫ్లోర్ లీడర్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీలు విటపు బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ గేయానంద్ తదితరులు అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వేసవి క్రీడా శిక్షణా శిబిరాల్లోని క్రీడాకారులకు వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సుబ్బరాజు మాట్లాడుతూ కామరాజు, లక్ష్మి, విజయ, పవన్, ఎస్.గ్రీష్మిచౌదరి, రాశి, రాజు, సాయినాథ్, తేజ్ సిద్ధార్థల సౌజన్యంతో క్రీడాకారులకు పౌష్టికాహారం అందజేశామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు డిమాండ్ చేశారు. కావలి పట్టణంలోని యూఈఈయూ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. విద్యుత్ సబ్‌స్టేషన్లలో వాచ్‌మెన్లుగా ఉన్న వారిని యథావిధంగా కొనసాగించాలని, మీటర్ రీడర్స్‌కు కనీస వేతనం ఇవ్వాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. 2022 పీఆర్సీ, అరియర్స్‌ను వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం 17 మందితో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో అధ్యక్షుడిగా మనోహర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నాగార్జున, కోశాధికారిగా శ్రీనివాసులు, డిప్యూటీ కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా రమేష్, శ్రీనివాసులు, రమణారెడ్డి, రసూల్, సహాయ కార్యదర్శులుగా హరి, జీవన్, ప్రభాకర్, రవీంద్ర, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వెంకటేశ్వర్లు, ఏసోబు, రమణయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుమన్, తదితరులు పాల్గొన్నారు.

పట్టించుకోకుంటే సాగు కష్టమే


తిక్కవరప్పాడు బ్రాంచ్ కెనాల్ నుంచి రేవూరివారి చెరువుకు నీటిని మళ్లించే ప్రాంతంలో తూములు లేని దృశ్యం


రాగలగుంట చెరువు వద్ద ధ్వంసమైన తూములు

- ధ్వంసమైన తిక్కవరప్పాడు బ్రాంచ్ కెనాల్ తూములు
- చెరువుల్లో నీటిని నింపేందుకు ఏటా రైతులకు కష్టాలు
- 600 ఎకరాల సాగు ప్రశ్నార్థకం

మండలంలోని తిక్కవరప్పాడు బ్రాంచ్ కెనాల్ నుంచి తిక్కవరప్పాడు గ్రామంలోని చెరువులకు సోమశిల జలాలను నింపాలంటే రైతులు ఏటా నానా కష్టాలు పడుతున్నారు. బ్రాంచ్ కెనాల్ నుంచి చెరువులకు నీటిని మళ్లించే ప్రాంతాల్లో ఏళ్ల క్రితం నిర్మించిన తూములు ధ్వంసమైనా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటివరకు వర్షాలు సక్రమంగా కురుస్తుండడంతో రైతులు ఇబ్బందుల్లేకుండా పంటలు పండించుకుంటున్నారు. వర్షాలు సక్రమంగా కురవకపోతే 600 ఎకరాలకు పైగా సాగు ప్రశార్థకమేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెంకటాచలం : వెంకటాచలం మండల పరిధిలో కనుపూరు కెనాల్‌కు తిక్కవరప్పాడు బ్రాంచ్ కెనాల్ ఉంది. గ్రామ పరిధిలోని కోన చెరువు, రేవూరి వారి చెరువు, రాగలగుంట చెరువులకు సోమశిల జలాలను తిక్కవరప్పాడు బ్రాంచ్ కెనాల్ ద్వారా నింపాల్సి ఉంది. అయితే ఏళ్ల క్రితం నిర్మించిన తూములు ధ్వంసమైపోవడంతో రైతులు ఏటా ఇసుక బస్తాలు అడ్డం వేసుకుని చెరువులకు నీటిని మళ్లిస్తున్నారు. ఇసుక బస్తాలు వేసి చెరువులకు నీటిని నింపాలంటే రైతులకు కష్టంతో కూడిన పనిగా మారింది. ధ్వంసమైన తూములను నిర్మించి చెరువులకు సజావుగా నీటిని నింపాలని రైతులు కోరుతున్నారు. సకాలంలో వర్షాలు పడుతుండడంతో రైతులకు శ్రమ లేకుండా చెరువులు నిండి పోతున్నాయి.

తూములు నిర్మించకుంటే సాగు కష్టం

వర్షాలు కురవకపోతే తిక్కవరప్పాడు గ్రామంలో రైతులు సోమశిల జలాలపై పూర్తిగా ఆధారపడాల్సి వస్తుంది. సోమశిల జలాలు చెరువుల్లోకి రావాలంటే తిక్కవరప్పాడు బ్రాంచ్ కెనాల్ తప్ప మరో మార్గం లేదు. అయితే బ్రాంచ్ కెనాల్ నుంచి చెరువులకు నీరు విడుదల చేసే ప్రాంతాల్లో తూముల నిర్మాణం, చెక్కల ఏర్పాటు లేకపోవడంతో రైతులు ప్రతి ఏడాది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈవిషయం గురించి పలు దఫాలు ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసమైన తూములను మళ్లీ నిర్మించి, చెక్కలు ఏర్పాటు చేస్తే అన్నీ చెరువులకు సజావుగా నీరు చేరుతుందని రైతులు చెబుతున్నారు. తూముల నిర్మాణం చేపట్టకపోతే 600 ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకమవుతుందని రైతులు వాపోతున్నారు. అధికారులు జోక్యం చేసుకుని రైతుల సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి చర్యలు

తిక్కవరప్పాడు బ్రాంచ్ కెనాల్ పరిధిలో పలు చెరువులకు సాగునీరు విడుదల చేసే ప్రాంతాల్లో తూములను ధ్వంసం చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని నిర్మించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతాం.

– సుధీర్, ఇరిగేషన్, ఏఈ

మలేరియాపై అవగాహన ర్యాలీ


పొదలకూరు : ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది, వైద్యాధికారులు

పొదలకూరు : మండలంలోని మహ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మలేరియాపై అవగాహన ర్యాలీని వైద్యాధికారుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ దోమలు నిల్వ ఉండే ప్రదేశంలో అబెట్ ద్రవణాన్ని పిచికారీ చేయించాల్సిందిగా సూచించారు. మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయించాలని, దోమకాటు ద్వారా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి జ్వరాలు వ్యాప్తి చెందుతాయన్నారు. ఇళ్లల్లో దోమతెరలు వాడుకోవాలని, కిటికీలకు మెస్‌లను బిగించుకోవాల్సిందిగా సూచించారు. ఈ ర్యాలీలో వైద్యాధికారులు ప్రవంతి, కిరణ్‌రిషిత, ఆరోగ్యశాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇనమడుగులో..

కోవూరు : మండలంలోని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీని మంగళవారం నిర్వహించారు.


కోవూరు : ఇనమడుగు గ్రామంలో..

ఈ సందర్భంగా వైద్యాధికారులు నిరంజన్, ఇర్ఫాన్, జిల్లా ప్రోగ్రామ్ అధికారి దయాకర్ పాల్గొని, మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభం కానుండడంతో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమల వ్యాప్తి లేకుండా చూసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

టీపీగూడూరు, పేడూరు సొసైటీ ఛైర్మన్ల రాజీనామా

తోటపల్లిగూడూరు : తోటపల్లిగూడూరు పీఏసీఎస్ ఛైర్మన్ కావలిరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, పేడూరు పీఏసీఎస్ ఛైర్మన్ తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం తమ పదవులకు రాజీనామా చేశారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఓడిపోవడంతో పాటు సర్వేపల్లి నియోజకవర్గంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి గెలుపొందకపోవడంతో వీరు తమ పదవులకు రాజీనామాలు చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాజీనామా లేఖలను జిల్లా సహకార శాఖ డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారికి సమర్పించారు. ఇద్దరు పీఏసీఎస్ ఛైర్మన్లతో పాటు డైరెక్టర్లు మద్దెన వెంకటసుబ్బానాయుడు, ఈదూరు రామాచార్యులు, తిరవళ్లూరు ఈశ్వరయ్య తమ పదవులకు రాజీనామాలు చేశారు.


కావలిరెడ్డి హరిశ్చంద్రారెడ్డి


తూపిలి ఉదయ్ కుమార్‌రెడ్డి

రిటైర్డ్ హెచ్‌ఎంకు సన్మానం



కొడవలూరు : మండలంలోని రామాపురం(జీసీ) ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తూ గత నెల 31న పదవీ విరమణ చేసిన షేక్.గౌస్‌బాషాకు బుచ్చిరెడ్డిపాళెం కేజీఎస్ షాదీ మంజిల్‌లో మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు శాలువాలు, బహుమతులతో ఆయన్ను ఘనంగా సన్మానించారు. కొడవలూరు ఎంఈఓ ఎస్.అంకయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా 38 సంవత్సరాల పాటు గౌస్‌బాషా అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఎస్డీ అబ్దుల్ హమీద్, పీవీ రత్నం, జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీవీ శేషులు, జీవీ చలపతిశర్మ, యూటీఎఫ్ రాష్ట్ర నేత పి.బాబురెడ్డి, జిల్లా నాయకులు మురళీధర్‌రావు, ఎస్కే ఖాజావలి, కేవీ శ్రావణ్‌కుమార్, మండల నాయకులు పి.తిరుపాలు, ఎస్కే ఖాదర్‌బాషా, ఎన్వీ సుబ్బారావు, టి.వెంకటేశ్వర్లు, జి.నాగభూషణం, ఎం.దయాకర్ పాల్గొన్నారు.

ముగిసిన జయంతి ఉత్సవాలు


ఆలయంలో అన్నదాన కార్యక్రమం

ముత్తుకూరు : ముత్తుకూరులోని వీరాంజనేయ స్వామి ఆలయంలో 10 రోజుల పాటు జరిగిన హనుమజ్జయంతి ఉత్సవాలు మంగళవారం పరిసమాప్తమయ్యాయి. సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆలయంలో చివరి రోజు ప్రత్యేక పూజ, భజన కార్యక్రమాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమాలకు ఈదూరు రామకృష్ణారెడ్డి, ఈదూరు రామ్మోహనరెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

15 నుంచి చేపలవేట ప్రారంభం

- 61 రోజుల విరామం పూర్తి


కృష్ణపట్నం తీరంలో వలలు, మరపడవలు

ముత్తుకూరు : జూన్ 15వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సముద్రంలో చేపల వేట ప్రారంభమవుతుంది. వేటపై విధించిన 61 రోజుల నిషేధం 14వ తేదీతో పూర్తవుతుందని మత్స్యశాఖ అధికారులు మంగళవారం వెల్లడించారు. సముద్రంలో చేపలు, రొయ్యలు ఇతర మత్స్యసంపద సంతాన ఉత్పత్తి చేయాల్సి ఉండడంతో ప్రభుత్వం ఈ నిషేధం అమల్లో పెట్టింది. నిషేధ సమయంలో పడవలు, తెప్పలు, మరపడవలు తదితర బోట్లు ఏపీ సముద్రంలో వేట చేయకూడదు. ప్రస్తుతం గడువు సమీపించడంతో వేటకు అవసరమైన వలలు, పడవలను మత్స్యకారులు సిద్ధం చేసుకుంటున్నారు. మండలంలోని నేలటూరు పట్టపుపాళెం, కృష్ణపట్నం పంచాయతీలోని ఆర్కాట్‌పాళెం, రామ్‌నగర్, ముత్తుకూరు పంచాయతీలోని పట్టపుపాళెం, ఈపూరు పట్టపుపాళెం మత్స్యకారులు వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. చేపలవేట నిషేధ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకార భరోసా పథకం కింద వారి కుటుంబానికి రూ.10,000లు ఆర్థిక సాయం అందజేసిన విషయం తెలిసిందే.

చికెన్ వ్యర్థాల దుర్వాసనతో వేగలేకున్నాం


రోడ్డెక్కి ఆందోళన చెస్తున్న రామన్నపాళెం గ్రామస్తులు

- అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్
- రోడ్డెక్కిన రామన్నపాళెం గ్రామస్తులు

కొడవలూరు : చికెన్ వ్యర్థాల దుర్వాసనతో వేగలేకున్నామంటూ మండలంలోని రామన్నపాళెం గ్రామస్తులు రోడ్డెక్కారు. గ్రామ శివారుల్లో ఉన్న చేపల గుంతల వద్దకు ఇతర రాష్ట్రాల నుంచి చికెన్ వ్యర్థాలను లారీల్లో గ్రామం మీదుగా తరలిస్తున్నారంటూ గ్రామస్తులు పెద్ద సంఖ్యలో మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోడి వ్యర్థాలను చేపలకు ఆహారంగా వేసేందుకు లారీల్లో గ్రామం మీదుగా తీసుకుపోతున్నారని తెలిపారు. కుళ్లిన వ్యర్థాల నుంచి వచ్చే దుర్గంధం ఇళ్లలో ఉన్నా భరించలేనంతగా వస్తోందన్నారు. ఈ లారీలు వెళ్లిన అరగంట వరకు కూడా దుర్వాసన గ్రామాన్ని కమ్ముకునే ఉంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్వాసన కారణంగా అనారోగ్యాల బారిన పడుతున్నామని పలు పర్యాయాలు హెచ్చరించినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. గ్రామస్తులంతా సమైక్యంగా అడ్డుకోవాలన్న సంకల్పంతో రోడ్డెక్కామని, దీనిని ముందుగానే గ్రహించిన వ్యాపారులు మంగళవారం గ్రామంలోకి రాలేదన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని వ్యర్థాల రాకను అడ్డుకుని రామన్నపాళెం, మానేగుంటపాడు, రెడ్డిపాళెం గ్రామాలను కాపాడాలని కోరారు. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి వినతి పత్రం ద్వారా తెలిపి పరిష్కరించాలని కోరనున్నామని పేర్కొన్నారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు


విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా మల్లిం కొండయ్య కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, సాయంత్రం స్వామికి ప్రత్యేక పూజలు, పల్లకి సేవ గావించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విశ్వనాథునికి రుద్రాభిషేకం



మనుబోలు : మనుబోలు– చెర్లోపల్లి రైల్వే గేటు సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయంలో సోమవారం రాత్రి విశ్వనాథునికి రుద్రాభిషేకం నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు విశ్వనాథస్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. దండు చంద్రశేఖర్‌రెడ్డి, రాజేశ్వరమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

మారెమ్మకు సద్ది సమర్పణ

తోటపల్లిగూడూరు : మండలంలోని చిన్నచెరుకూరు గ్రామ దేవత మారెమ్మకు మంగళవారం మహిళలు సద్దిని సమర్పించారు. గత నెల 28న మారెమ్మ అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో మూడో మంగళవారం అమ్మవారికి సద్ది సమర్పణ గావించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

యోగా గురువుకు సత్కారం



కొడవలూరు : మండలంలోని గండవరం ఆయుర్వేద వైద్యశాల యోగా శిక్షకుడు(గురువు) జ్యోతి రాజేంద్రకుమార్‌ను విజయమూరులోని వేద గాయత్రి దేవి ధ్యాన, యోగా కేంద్రం వారు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఆ కేంద్రం రెండో వార్షికోత్సవం సందర్భంగా యోగా వ్యాప్తికి కృషి చేస్తున్న గురువులను సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ ఆరోగ్యకర జీవనానికి యోగా సాధన అవసరమని, ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని కోరారు.

ఘనంగా మొలక పోలేరమ్మ ఉత్సవాలు


పల్లకిసేవలో అమ్మవారు



ఇందుకూరుపేట : మండలంలోని కొమరిక గ్రామంలో కొలువైన మొలక పోలేరమ్మ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకాలు, పూర్ణాహుతి హోమాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. అర్చకుడు శాస్త్రి ఆధ్వర్యంలో వేదపండితులు అల్లూరు కృష్ణమూర్తి, పోగుల కుమారస్వామి పూజలు జరిపించారు. గ్రామస్తులు పొంగళ్లు పొంగించి, సద్దిని భక్తిశ్రద్ధలతో సమర్పించారు. రాత్రి పల్లకిసేవ గావించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో కోలాహలం నెలకొంది.

ప్రమాదకరంగా ప్రయాణం


ప్రమాదకరంగా ఆటోలో ప్రయాణిస్తున్న గ్రామస్తులు

పొదలకూరు : ఆటోలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఆర్టీసీ బస్సుల వేళలు ప్రయాణికులకు అనుకూలంగా లేకపోవడంతో ఆటోల మీదనే ఆధారపడి ప్రమాదపుటంచున ప్రయాణిస్తున్నారు. ఈ మేరకు ఆటో డ్రైవర్లు ప్రయాణికులను కుక్కి తీసుకుని వెళ్తున్నారు. చంటి బిడ్డలను సైతం ఆటోల్లో తమ వెంట తీసుకుని వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఉపాధ్యాయులు, ఉద్యోగులు సైతం గ్రామీణ ప్రాంతాలకు ఆటోలనే ఆశ్రయించాల్సి వస్తోంది. నిబంధనల ప్రకారం ప్రయాణికులను తరలిస్తే తమకు నష్టం వస్తుందని, అందువల్లే అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కిస్తున్నట్లు ఆటో డ్రైవర్లు సమర్థించుకుంటున్నారు. ఆటోలను నియంత్రించడం పోలీసుల వల్ల కూడా కావడం లేదు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విడవలూరు : స్థానిక పీఆర్‌ఆర్-వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 18వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో అప్లయ్ చేసుకోవాలని కోరారు.